క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం ఫాల్గుణ మాసం పూర్వాభాద్ర నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

భద్రారెడ్డిని పరామర్శించిన ప్రసాద రెడ్డి



భద్రారెడ్డిని పరామర్శిస్తున్న ప్రసాదరెడ్డి

బల్లికురవ: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, అద్దంకి ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి తల్లి యర్రం పిచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి ఒంగోలులోని భద్రారెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నేతలున్నారు.

నేడు బడ్జెట్ సమావేశం

చీరాల అర్బన్: చీరాల మున్సిపాలిటీలో 2025–26 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలపై సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ గురువారం తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు హాజరు కావాలన్నారు.

ఈ శ్రామ్ కార్డు పొందిన వారికి బీమా

అద్దంకి: ఈ శ్రామ్ కార్డు పొందిన వారికి ప్రమాద బీమా వర్తిస్తుందని కార్మిక శాఖ అధికారి మధుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతిచెందినా లేక పూర్తి అంగవైకల్యం కలిగినా వర్తింస్తుందని చెప్పారు. ఈ నెల 31వ తేదీ లోపుగా కార్మిక శాఖ అధికారి కార్యాయంలో లేదా, వెలుగు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాని తెలిపారు. ప్రమాదంలో మరణించిన వారు 26 సెప్టెంబర్ 2021 నుంచి 31 మార్చి 2022 మధ్యలో మృతిచెందిన వారై ఉండాలని తెలిపారు.

ఆస్పత్రిలో పరిశుభ్రత ముఖ్యం

చీరాల రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు సక్రమంగా వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిలో వార్డులు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని కోరారు.

అర్బన్ ప్రాపర్టీ సర్వే ప్రారంభం

ఒంగోలు సబర్బన్: నగరంలోని క్లౌ పేట సచివాలయం పరిధిలో జరుగుతున్న నక్ష సర్వే కార్యక్రమాన్ని గురువారం ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చేపట్టిన సర్వేలో రాష్ట్రం నుంచి 10 మున్సిపాలిటీలు మాత్రమే ఎంపికయ్యాయన్నారు. వాటిలో ఒంగోలు నగర పాలక సంస్థ కూడా ఉందన్నారు. ఈ సర్వే ద్వారా అర్బన్ ప్రాపర్టీస్ అన్ని డిజిటలైజేషన్ చేస్తామని, సర్వేను 45 రోజుల్లో పూర్తి చేసేందుకు నగరంలో 42 బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో టీపీఓ బాబురావు, టీపీఎస్ శివ ప్రసాద్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మరణంపై నిజాలు తేల్చాలి

సంతనూతలపాడు: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలని మండలం పాస్టర్ల యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ ఇటీవల రాజమండ్రిలో ప్రమాదంలో అనుమానస్పదంగా మృతి చెందడంపై మండల పాస్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ర్యాలీ, కొవ్వొత్తుల ప్రదర్శన, సంతాపం, ఆదరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రవీణ్ సేవకుడు, మంచి వక్త అని, అతని మృతిపై ప్రభుత్వం స్పందించి విచారణ చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. పాస్టర్ ప్రవీణ్ మృతికి పలువురు పాస్టర్లు ఈ సందర్భంగా సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంకారావు, సీపీఎం నాయకులు ఎస్ వెంకటేశ్వర్లు, మండల పాస్టర్ సంఘాల యూనియన్ అధ్యక్షుడు టీ. జాషువా తదితరులు పాల్గొన్నారు.

కార్డుకు కత్తెర?

- రేషన్ కార్డుదారులకు ఇ–కేవైసీ టెన్షన్
- ఈ నెల 31లోపు చేయించుకోకపోతే రేషన్ కట్
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు



రేషన్ కార్డులు

వేటపాలెం: రేషన్ కార్డుదారులకు ఇ– కేవైసీ టెన్షన్ పట్టుకుంది. ఈ నెల 31 లోగా కార్డుదారులు ఇ–కేవైసీ చేసుకోకపోతే రేషన్ కట్ చేస్తారనే వార్తల నేపథ్యంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇది కచ్చితంగా కార్డులను తొలగించే కుట్రేనని పలువురు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదరులను ఇ– కేవైసీ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇ– కేవైసీ లేకుండానే కార్డుల్లోని లబ్ధిదరులందరికీ బియ్యం అందించారు. అయితే కూటమి ప్రభుత్వ నూతన విధానంతో పేదలు అవస్థలు పడుతున్నారు.

ఇతర ప్రాంతాల్లో ఉంటే..?

రేషన్ కార్డుదారులో ఉన్న కొందరు కుటుంబ సభ్యులు కూలీ పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. మరి కొందరు తమ పిల్లలు చదువుల కోసం, ఉపాధి కోసం హైదరాబాదు, బెంగళూరు, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లారు. మరి కొందరు ఇతర రాష్ట్రాలకు వెళ్లారు. ఇలా దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇ– కేవైసీ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో విద్యార్థులు దూరప్రాంతాల నుంచి వచ్చి ఇ– కేవైసీ చేయించుకోవడం చాలా కష్టంగా మారింది. అలాగే విద్యార్థులపై ఆర్థికభారం కూడా పడుతోంది. దీంతో లబ్ధిదారులు కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాడు ఒకరితో సరి..

నాటి ప్రభుత్వ హయాలో ఇంటి యజమాని ఒకరు ఇ–కేవైసీ చేయించుకుటే సరిపోయేదని, అయితే నేటి కూటమి ప్రభుత్వం రేషన్‌కార్డులో ఉన్న సభ్యులందరూ (5 ఏళ్ల పిల్లలు వినహా) తప్పని సరిగి ఇ– కేవైసీ చేయించుకోవాలని నిబంధన పెట్టడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పేదలకందే నిత్యావసరాలను కట్ చేయడానికే కుట్ర పన్నిందని పలువరురు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా చాలా మంది అనేక కారణాలతో ఇ– కేవైసీ చేయించుకోవడానికి సాధ్యం కావడం లేదు. వీరందరినీ రేషన్ కార్డుల నుంచి తొలగించనున్నారు. నిత్యావసర సరుకులను కూడా అందించకుండా నిలిపి వేసే ప్రమాదం నెలకొంది. ఇ– కేవైసీ చేయించుకోని లబ్ధిదరులు కొత్త కార్డులు పొందడానికి కూడా అర్హత కోల్పోతారు.

తక్కువ సమయం

కూటమి ప్రభుత్వం ఈ–కేవైసీ చేయించుకోవడానకి డెడ్‌లైన్ విధించింది. ఈ నెల 31వరకూ అవకాశం కల్పించింది. ఇదే చివరి అవకాశమని లబ్ధిదారులకు తెలిపింది. ఈ నెల31 లోగా ఇ– కేవైసీ చేయించుకోకపోతే సదరు సభ్యుడికి నిత్యావసర సరుకులు అందే పరిస్థితి లేదు.

మండలం	లబ్ధిదారుల సంఖ్య	చేసుకున్న వారు	చేయించుకొని వారు
చీరాల	129737	118665	11072
వేటపాలెం	63415	57554	5751

వెంటనే ఇ– కేవైసీ చేయించు కోవాలి

రేషన్ కార్డులో సభ్యులుగా ఉన్న వారందరూ ఈ నెల 31 లోగా ఈ–కేవైసీ చేయించుకోవాలి. లేపోతే రేషన్ కోల్పోయే పరిస్థితి ఉంది. పూర్తిస్థాయిలో ఇ–కేవైసీ చేయించడానికి ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నాం. డీలర్లకు బాధ్యత అప్పగించాం. లబ్ధిదారులు కూడా ఎక్కడ ఉన్నా సరే గ్రామాలకు వచ్చి ఈ–కేవైసీ చేయించుకోవాలి.

– గీత, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థే!



ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న డిప్యూటీ ఈఓ గంగాధర్

యద్దనపూడి: తరగతి గదిలో ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగానే ఉండాలని పర్చూరు డిప్యూటీ ఈఓ డి.గంగాధర్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని పూనూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో చేపట్టిన నాడు–నేడు పనులను, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు బోధనతోనే విద్యార్థులను ఆకట్టుకోవాలని సూచించారు. పాఠ్యాంశాలతో పాటు విద్యార్థులకు కమశిక్షణతో కూడిన విలువలను నేర్పించాలని సూచించారు. వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థులు సంఖ్య పెరిగేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ చిలుకూరి గోపి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పాఠశాల వ్యవస్థాపక వారసులు బత్తుల కృష్ణవేణి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

1 నుంచి సదరం స్లాట్

బల్లికురవ: సదరం సర్టిఫికెట్లు పొందేందుకు అర్హులైన దివ్యాంగులు స్లాట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కుసుమకుమారి గురువారం తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి స్లాట్ ప్రారంభం అవుతుందని ఎంపిక చేసిన జిల్లా ఆసుపత్రుల్లో స్లాట్‌తో సదరం సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు.

గురుకులానికి గ్రైండర్ అందజేత



గ్రైండర్ అందజేస్తున్న దాతలు, రోటరీ అధ్యక్షుడు

అద్దంకి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శింగరకొండకు సమీంలోని గురుకుల బాలికల కళాశాలకు గురువారం అందజేశారు. ఈ గ్రైండర్‌ను పట్టణానికి చెందిన రంగనాయకు బుక్ షాపు యజమాని బుల్లిబాబు విశ్రాంత ఉపాధ్యాయుడు వారణాశి రఘురామశర్మ సౌజన్యంతో అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కళాశాల ప్రిన్సిపాల్ దుర్గ గాయత్రి, రోటరీ క్లబ్ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



భూసార పరీక్షల గురించి రైతులకు వివరిస్తున్న మండల వ్యవసాయాధికారి

అద్దంకి రూరల్: భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. గురువారం బొమ్మనంపాడులో మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. భూమిలో నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాలు అయిన జింక్, బోరాన్, కాల్షియం, ఇనుము ఎంత మోతాదులో ఉన్నయో తెలుసుకోవచ్చని వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఆజాద్, వ్యవసాయ విస్తరణాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్వారీయింగ్ అనుమతి కోసం ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న

చీమకుర్తి రూరల్: క్వారీయింగ్ అనుమతి కోసం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. గురువారం మండలంలోని రామతీర్థం ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో క్వారీయింగ్ కోసం ప్రజాభిప్రాయ సేకరణ ఒంగోలు ఆర్డీవో కే.లక్ష్మి ప్రసన్న నిర్వహించారు. మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సర్వే నంబర్ 55/3ఈలో 14.17 హెక్టార్లలో క్వారీయింగ్ అనుమతి కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రాఘవరెడ్డి అధ్యక్షతన ప్రజాభిప్రాయం సేకరించగా చీమకుర్తి, రాజుపాలెం, లక్ష్మీపురం, బూదవాడ గ్రామాల చుట్టుపక్కల పరిధిలోని ప్రజలు పాల్గొని అభిప్రాయాలు తెలియజేశారు. సమావేశం నందు ఎటువంటి అభ్యంతరా రాలేదు. రామతీర్థం పరిధిలో ఈఎస్‌ఐ హాస్పిటల్ నిర్మించాలని, క్వారీల్లో పనిచేసే కార్మికులు ప్రమాదానికి ఒక అంబులెన్స్, ప్రభుత్వ డాక్టర్ ఎప్పుడూ ఉండేలా చూడాలని అభిప్రాయాలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, ఏపీఎండీసీ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల ఎంపిక

కొత్తపట్నం: జిల్లా వైఎస్సార్ సీపీ ఆదేశాల మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా, యూత్ కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. 28న గుండమాల, మోటుమాల, పాదర్తి, 29న కె.పల్లెపాలెం, రంగాయపాలెం, కొత్తపట్నం, 30న గమళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, రాజుపాలెం, 31న సంకువారిగుంట, ఈతముక్కల, మడనూరు, ఏపిల్ 1వ తేదీన ఆలూరు, గాదెపాలెం, అల్లూరు గ్రామాల కమిటీలు ఎంపికలు జరుగుతాయని, అందరు హాజరు కావాలని ఆయన ప్రకటనలో కోరారు.

బాలికల రక్షణ మనందరి బాధ్యత



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి: సమాజంలో బాలికల రక్షణ మనందరిపై ఉంటుందని సీఐ ఎం.సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో బాలికల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు తెలిపారు. బాలికల రక్షణ చట్టం, పోక్సో కేసులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ–1, 2 నరశింహరావు, శివాజీ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు ముందస్తు చర్యలు



రసాయనాలు పిచికారీ చేయిస్తున్న వైద్యసిబ్బంది

చీమకుర్తి రూరల్: మండలంలోని రామతీరంలో బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మలేరియా కేసులు నివారణకు ముందస్తు చర్యలు చేపట్టారు. గురువారం రామతీరంలో మలేరియా కేసులు పెరుగుతుండటంతో కమ్యూనిటీ హెల్త్ అధికారి సీహెచ్ మాధవరావు నివాసగృహాలకు, బంకులకు డీడీటీ బదులు ఆల్ఫా సైపర్‌మెత్రిన్ పౌడర్‌ను పచికారీ చేయించారు. ఆల్ఫా సైపర్ మెత్రిన్ 45 రోజులు వరకు పనిచేస్తుందని తెలిపారు. పరిశుభ్రత అందరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం పరిశీలన

మద్దిపాడు: జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం వెంకటేశ్వర్లు గురువారం మద్దిపాడు ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ప్రభుత్వం బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపులకు ఏర్పాటు చేసిన రుణాల మంజూరుకై తయారైన యాక్షన్ ప్లాన్‌లను రికార్డులను ఆయన పరిశీలించారు. రుణాల కోసం ధరఖాస్తులు చేసుకున్న అర్జీలను పరిశీలించారు. సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ పథకం కింద మ్యాపింగ్ అయి ఉన్న టైలరింగ్ సెంటర్‌ల వివరాలను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో డీఎస్‌వీ ప్రసాద్, ఈవోపీఆర్‌డీ రఘుబాబు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

సంతనూతలపాడు: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు నిలుస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. మండలం కేంద్రం సంతనూతలపాడులోని పెద్ద బజార్‌లో ఉన్న మసీద్‌లో గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, దుంపా యలమందారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు ముస్లిం సోదర, సోదరీమణులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మత పెద్దలు వస్తద్ ఫిరోజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు షేక్ రహంతుల్లా, ఉప సర్పంచ్ ఐవీ సుబ్బయ్య, నాయకులు దుంపా ఇంద్రసేనారెడ్డి, కుంచాల నాగంజనేయులు, కే అంకుల్, తన్నీరు మోహన్‌రావు, వల్లెపు శ్రీను, డాక్టర్ శ్రీనివాసరావు, కొత్తపల్లి సుబ్బయ్య, షేక్ మస్తాన్ వలి, కాలేషా, గౌసాని, ఖాదర్, హుస్సేన్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తాగునీటి విరామం ఇవ్వాలి



అద్దంకి: వాటర్ బాటిళ్లు అందిస్తున్న ఎంఈఓ

అద్దంకి: వేసవి దృష్ట్యా తాగునీటి విరామం కోసం బెల్ కొట్టడం అవసరమని మండల విద్యాశాఖాధికారి బి. సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్‌బెల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇండియా ఎంపవర్‌మెంట్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో విద్యార్థులకు వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు.

అద్దంకి రూరల్: వేసవిలో నీరు తాగటం అత్యవసరమని ఎంఈఓ బి. సుధాకర్‌రావు అన్నారు. గురువారం స్థానిక నంబూరివారిపాలెంలో గల ఎంపీపీ పాఠశాలలో వాటర్ బెల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 70 మంది విద్యార్థులకు ఐఈఈఆర్‌డీ స్వచ్ఛంద సేవా సంస్థ ఉచితంగా వాటిల్ బాటిళ్లు అందజేశారు.

12న విశ్రాంత ఉద్యోగుల సంఘ ఎన్నికలు



ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న యర్రగుంట కృష్ణమూర్తి తదితరులు

మార్టూరు: మార్టూరు యూనిట్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏప్రిల్ 12వ తేదీ నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి యర్రగుంట కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గురువారం ఆయన పెన్షనర్ల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 12వ తేదీ శనివారం ఎన్నికలు నిర్వహించనున్నామని ఈ మేరకు ఆయన ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ విడుదల చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రావుల బాపయ్య చౌదరి, కరికమలేశ్వరరావు, మార్టూరు యూనిట్ అధ్యక్షుడు షేక్ కమాలుద్దీన్, ప్రధాన కార్యదర్శి ఎంఎస్. చిట్టిబాబు, కోశాధికారి కర ణం లక్ష్మయ్య, పిచ్చియ్య శర్మ, హనుమంతరావు, రామారావు, టివి రమణయ్య,అంకయ్య, గొట్టిపాటి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక ప్రజావేదిక సభ

అద్దంకి: సమాజిక తనిఖీపై ప్రజావేదిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శింగయ్య గురువారం ఒక ప్రకనలో తెలిపారు. ఈవేదిక కార్యక్రమం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం 11.30 గంటలకు ప్రారంభం అవుతందని తెలిపారు. కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షుడు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని కోరారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఏపీఓ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్, ఉపాధి కూలీలు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు అభినందనలు



నవోదయ సీటు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న విద్యాశాఖాధికారి

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు మండలంలో నవోదయ పరీక్షలు 2025లో సీటు సాధించిన విద్యార్థులను మండల విద్యాశాఖాధికారి ఎ. శ్రీనివాసరావు అభినందించారు. భీమవరం మండల పరిషత్ పాఠశాల విద్యార్థి తెలగపూడి నిత్య నిబంధన ఆదర్శ పాఠశాల విద్యార్థి సహనూర్, నివేదిత ప్రాథమిక పాఠశాల విద్యార్థి పాలపర్తి చైతన్య సీటు సాధించడంతో మండల విద్యాశాఖ తరపున అభినందించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

యంత్ర పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

బల్లికురవ: యాంత్రీకరణలో భాగంగా సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు పొందేందుకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్వీపీ కుమారి గురువారం తెలిపారు. మండలానికి 30 ట్రాక్టర్ పరికరాలు, 20 మంది పిచికారీ చేసే స్ప్రేయర్లు మంజూరైనట్లు చెప్పారు. 9 చెక్కల గొర్రు రూ. 43350 ధర కాగా 50 శాతం సబ్సిడీ, 11 చెక్కల గొర్రు రూ. 49960 ఖరీదు కాగా రూ. 50 శాతం సబ్సిడీ, విత్తనపు గొర్రు రూ.3240 ఖరీదు కాగా రూ. 25 వేలు సబ్సిడీ వస్తుందని తెలిపారు. మందు పిచికారీ చేసే స్ప్రేయర్ రూ. 26010 ఖరీదు కాగా రూ.10 వేలు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఇ–పంటలో నమోదు చేసుకుని, చిన్న సన్నకారు, ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులు గత 5 సంవత్సరాల్లో సబ్సిడీ పొందన వారే అర్హులన్నారు. తక్షణమే రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వారసత్వ సంస్కృతి భావితరాలకు అందించాలి



శివయ్య పంతులును సన్మానిస్తున్న దృశ్యం

జె.పంగులూరు: జానపద కళను నేటి తరానికి నేర్పించడం.. మన వారసత్వ సంస్కృతిని భావితరాలకు అందించడమేనని కోలాటం మాస్టారు వెంకటరెడ్డి అన్నారు. కోటపాడులో పోలేరమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా బుధవారం రాత్రి స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శించారు. గ్రంధి మారుతి బాబు విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ఉపాధ్యాయ బృందం కమిటీ అధ్యక్షుడు శివయ్య పంతులును, కోలాటం నేర్పిన గురువు వెంకటరెడ్డిని సన్మానించారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వెంకటసుబ్బయ్య, గడ్డం నాగేశ్వరరావు, గుంటుపల్లి కృష్ణమూర్తి, పెద ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

మద్దిపాడు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ ఆనందమోహన్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పొడి దుస్తులు వేసుకోవాలని, ప్రతిరోజూ తప్పక స్నానం చేయాలన్నారు. వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు.